కొండాపూర్‌లోని కొల్లా లగ్జరియా విల్లాస్ వద్ద నివాసంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు

లోకం పోకడ



తెలంగాణలో కాంగ్రెస్ ఎమర్జెన్సీ

మొదటిపేజీ తరువాయి...

పరామర్శలకు వెళ్లిన నేతలను కూడా ఠాణాల్లో బందీలుగా మార్చడం కాంగ్రెస్ సర్కార్ నిర్బంధకాండకు అద్దం పడుతున్నది. బీఆర్ఎస్ ముఖ్యనేతలతో పాటు తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని, ఈ విషయంపై దర్యాప్తు చేయాలని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కోసం వెళ్లిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపైనే కేసు పెట్టిన పోలీసులు, గురువారం ఆయనను అరెస్ట్ చేసి బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు. ఇదేమిటని ప్రశ్నించి అడ్డుకున్నందుకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి గచ్చిబౌలి స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. కౌశిక్‌రెడ్డిని నోటీసులిచ్చి బయటకు పంపకుండా రిమాండ్ చేయాలనే ఉద్దేశంతో రాత్రి వరకు ఆయనను ఠాణాలోనే ఉంచారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలను నిరసిస్తూ సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ఆందోళన చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు పలు చోట్ల లాఠీ ఝుళిపించారు.

ఉదయమే చొరబడి అరెస్ట్

గురువారం తెల్లవారుజామునే కొండాపూర్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసముంటున్న కొల్లా లగ్జరియా విల్లాస్ వద్ద బంజారాహిల్స్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీగా మోహరించారు. వీరికి తోడుగా గచ్చిబౌలి పోలీసులు కూడా భారీగా అక్కడికి చేరుకున్నారు. కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు వచ్చారని తెలిసి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి అక్కడికి చేరుకొని ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నదంటూ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో మరింతమంది బీఆర్ఎస్ శ్రేణులు కౌశిక్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకోకుండా విల్లాస్ ప్రధాన గేట్‌ను పోలీసులు మూసేయించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గేటు దూకి కౌశిక్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకొని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించారు. కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయకుండా అడ్డుకుంటున్నారని సైబరాబాద్ పోలీసులు ముందస్తుగా హరీశ్‌రావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులను అరెస్ట్ చేసి గచ్చిబౌలి పీఎస్‌కు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరులను అరెస్ట్ చేసి రాయదుర్గం పీఎస్‌కు తరలించారు. 'నాకు వారెంట్ చూపించాలి, నాపై ఏమేం కేసులు నమోదయ్యాయి? వాటిల్లో ఉన్న సెక్షన్లు ఏంటి? నా అరెస్టుకు స్పీకర్ అనుమతి ఇచ్చారా?' అని కౌశిక్‌రెడ్డి పోలీసులను నిలదీశారు. పోలీసులు ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో ఆయన బెడ్రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. అయినా లెక్కచేయని పోలీసులు తలుపులు బద్దలు కొట్టే ప్రయత్నం చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బలంతంగా వాహనం ఎక్కించి నేరుగా బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు. మీడియాతో మాట్లాడనీయకుండా ఆంక్షలు పెట్టారు. అరెస్ట్ సందర్భంగా కౌశిక్‌రెడ్డి ఇంటి పరిసరాల్లో వందలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొండాపూర్‌లోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డినిఅదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అర్ధరాత్రి న్యాయమూర్తి వద్దకు..

ఉదయం 10 గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు, నోటీసులు ఇచ్చి వదిలిపెట్టేందుకు అవకాశాలున్నా రాత్రి పొద్దుపోయే దాకా పీఎస్‌లోనే నిర్బంధించారు. రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి అర్ధరాత్రి కొత్తపేటలోని న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. వాదనలు విన్న జడ్జి.. రిమాండ్‌ను తిరస్కరించారు. కౌశిక్‌కు బెయిల్ మంజూరు చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఘీభావం

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వారిని లోనికి రానివ్వకుండా గేట్లు మూసి ఉంచడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కాసేపటికి లోనికి అనుమతించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. అక్రమ కేసులపై పార్టీ పరంగా పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఇది అక్రమ అరెస్ట్ : బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాది లక్ష్మణ్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమంగా కేసు నమోదు చేయడంతో పాటు నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాది లక్ష్మణ్ తెలిపారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద న్యాయవాది లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారని, ఆయన మీద నమోదైన కేసు వివరాలు కూడా ఇవ్వలేదని చెప్పారు. నిందితుడి కుటుంబసభ్యులకు గాని, ఆయన తరపు న్యాయవాదికి గాని ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులు ఏడేళ్ల లోపు శిక్ష ఉన్నవి కాబట్టి నోటీసులు ఇస్తే సరిపోయేదని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడం సరికాదని చెప్పారు.

ఫిర్యాదు చేసేందుకు వస్తే కేసులా? : తలసాని

ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎమ్మెల్యేపై, ఇతర నాయకులపై కేసులు నమోదు చేయడం దారుణమని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. అక్రమకేసు నమోదు చేయడమే కాకుండా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం సరికాదని, ఎఫ్ఐఆర్‌ను గోప్యంగా ఉంచి అరెస్ట్ చేయడమేమిటని నిలదీశారు. ఎమ్మెల్యేకు మద్దతుగా వచ్చిన హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. పదేండ్ల పాటు కేసీఆర్‌గా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటివి ఎప్పుడూ చూడలేదని చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గచ్చిబౌలి పీఎస్ వద్ద అరెస్టుల పర్వం

హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేశారన్న విషయం తెలిసి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున గచ్చిబౌలి పీఎస్‌కు చేరుకొని హరీశ్‌రావును, ఇతర నేతలను పరామర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్, మాగంటి గోపీనాథ్, సునీతా లక్ష్మారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రసమయి బాలకిషన్, క్రాంతి కిరణ్, మహమూద్ అలీ, మర్రి జనార్దన్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు గచ్చిబౌలికి చేరుకొని హరీశ్‌తో మాట్లాడారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఠాణా ఎదుట ఆందోళనకు దిగారు. హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించారు. బలవంతంగా చెదరగొట్టి.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, బీఆర్ఎస్ మహిళా నేతలు సుమిత్రా ఆనంద్, రజితారెడ్డి, మమత తదితరులను అరెస్టు చేసి మోకిల ఠాణాకు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకొని ఆందోళన కొనసాగించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాక్షస పాలన నశించాలని నినదిస్తూ హరీశ్‌రావును, ఇతర బీఆర్ఎస్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల కర్కశత్వం

బీఆర్ఎస్ నేతలను ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించిన పోలీసులు.. వారిపట్ల కర్కశంగా ప్రవర్తించారు. ఉదయం నుంచి ఆందోళనల్లో ఉన్న వారిని ఆయా స్టేషన్లకు తరలించి కనీసం వారిని భోజనాలకు కూడా అనుమతించలేదు. వారు ఏ స్టేషన్‌లో ఉన్నారనే సమాచారం కుటుంబసభ్యులకు, ముఖ్యనేతలకు చెప్పే అవకాశం లేకుండా ఫోన్లు మాట్లాడొద్దంటూ హుకుం జారీ చేశారు. కొందరిని కాలకృత్యాలకు కూడా అనుమతించలేదు. స్టేషన్లలో ఫొటోలు తీయ్యొద్దని, వాటిని ఎవరికైనా పంపితే ఫోన్లు సీజ్ చేస్తామని బెదిరించారు. తమను పోలీసులు తీవ్రవాదులను చూసినట్టు చూశారని, దురుసుగా ప్రవర్తిస్తూ హేళనగా మాట్లాడారని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టం కాంగ్రెస్ చుట్టమా!

మొదటిపేజీ తరువాయి...

మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తెచ్చిన మార్పు నిర్బంధాలు, అక్రమ అరెస్టులే తప్ప మరేమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఏ నిరుద్యోగ యువతకు అయితే మాట ఇచ్చారో అదే యువతను అశోక్‌నగర్‌లో వీపులు పగిలాలా కొట్టించారు. గిరిజనులకు గొప్ప మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి రాత్రిపూట గిరిజనుల మీద దాడి చేయించారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తానని ఎమర్జెన్సీ పాలన తెచ్చారు. ఆడవాళ్లను పోలీసు బూటుకాళ్లతో తొక్కిపట్టి వారి భర్తలను అరెస్టు చేశారు. ఇప్పటికీ వారందరూ జైలు నిర్బంధంలో ఉన్నారు. పోలీసులతో రాజ్యమేలిన ఏ ప్రభుత్వం కూడా ముందుకు పడలేదు. పోలీసులను అతిగా ప్రయోగించిన ప్రభుత్వాన్ని కూడా ప్రజలు సహించలేదు. ఇందిరమ్మ లాంటి వాళ్లను సైతం కూకటివేళ్లతో పెకిలించిన దేశం భారతదేశం' అని హరీశ్‌రావు హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ ఆఫీసులుగా ఠాణాలు

రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాల గొంతు నొక్కాలని, ప్రశ్నించే గొంతులను అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. 'పోలీస్‌స్టేషన్లు అన్నీ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులుగా మారిపోయాయి. రాష్ట్రంలో ఇవాళ కేసులు, ఎఫ్ఐఆర్‌లు పోలీస్టేషన్లలో తయారవుతలేవు, గాంధీభవన్లో తయారవుతున్నయి. ఎవరిని అరెస్టు చేయాలో గాంధీభవన్‌లోనే నిర్ణయిస్తున్నరు. అక్కడి నుంచి, కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఆదేశాలిచ్చే పరిస్థితి రాష్ట్రంలో ఉన్నది. పోలీసు ఉన్నతాధికారులు ఒక విషయం గుర్తుంచుకోవాలి. రేవంత్‌రెడ్డి శాశ్వతం కాదు. రేపు బీఆర్ఎస్ ప్రభుత్వమో, ఇంకో ప్రభుత్వమో వస్తదని గుర్తుపెట్టుకోవాలి. రాజ్యాంగానికి లోబడి పనిచేయాలే తప్ప రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పనిచేస్తే మీరు ఇబ్బంది పడతారు. చట్టం, రాజ్యాంగం శాశ్వతం. కానీ, రేవంత్‌రెడ్డి శాశ్వతం కాదు' అని హెచ్చరించారు.

సైకోలాగా రేవంత్‌రెడ్డి

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైకోలాగా ప్రవర్తిస్తున్నరు. పగ, ప్రతీకారంతో శాడిస్టిక్ ప్రెజర్‌తో పనిచేస్తున్నరు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టాలని టార్గెట్ పెట్టుకున్నరు. ఏడాది పాలనలో ఫ్లైఓవర్, ఎస్టీపీ, కాళోజీ కళాక్షేత్రం ఇలా ఏదైనా కేసీఆర్ పాలనలో కట్టిందే. వాటినే నువ్వు ప్రారంభిస్తున్నవు తప్ప, నీ ఏడాది పాలనలో ఒక భవనమైనా కట్టినవా? రాష్ట్రంలో ప్రజా పాలన కాదు, రాక్షస పాలన నడుస్తున్నది. అక్రమ అరెస్టులు తప్ప మరే గ్యారెంటీ అమలవుతలేదు. ఇందిరా కాంగ్రెస్ ఎమర్జెన్సీ పాలన నాడు ఎలా ఉన్నదో నేడు రేవంత్ పాలన అదే ఎమర్జెన్సీని తలపిస్తున్నది. రాష్ట్రంలో ప్రజాపాలన కాదు రాక్షస పాలన నడుస్తుంది. ప్రజాపాలన ఉంటే ప్రశ్నించే పరిస్థితి కల్పించాలి. కానీ, ఇక్కడ ప్రశ్నించే పరిస్థితి కనిపించడం లేదు' అని మండిపడ్డారు.

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి సునీతారెడ్డి, మాలోతు కవిత, శంభీపూర్ రాజు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రసమయి బాలకిషన్, దేవీప్రసాద్, శంకర్‌నాయక్ తదితరులు

రాహుల్.. రేవంత్‌కు బుద్ధి చెప్పు

'దేశ ప్రతిపక్ష నాయకుడిని, నన్నెందుకు అరెస్టు చేస్తరు' అని రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని అడుగుతున్నరు. మరి తెలంగాణలో కూడా మీ సీఎం రేవంత్ అదే చేస్తున్నరు కదా. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న మధుసూదనాచారి లగచర్లకు వెళ్లే మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటున్నది. అర్ధరాత్రి పూట మహిళల గొంతు మీద కాలు పెట్టి భర్తలను అరెస్టుచేస్తే గిరిజన కుటుంబాల బాధలు వినడానికి వెళ్తున్న ప్రతిపక్ష నేతలను రేవంత్ ప్రభుత్వం అడ్డుకున్నది. హక్కుల సంఘాల మహిళా నేతలను సైతం అడ్డగించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఎక్కడుంది. రాహుల్‌గాంధీ.. ముందు మీ రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పు. ప్రతిపక్ష నేతలను అడ్డుకోవద్దని ఆదేశాలు ఇవ్వు. లేకపోతే సీఎం పదవి నుంచి తొలగించు. ఇటీవల రాహుల్ కూడా రేవంత్‌రెడ్డిని పక్కన పెట్టారు. అందుకే ఆయన అపాయింట్‌మెంట్ దొరకడం లేదు. మంత్రులు కుర్చీ లాక్కోవాలని చూస్తున్నారు. ఈ ప్రస్ట్రేషన్‌లో రేవంత్‌రెడ్డి సైకోలా ప్రవర్తిస్తున్నారు' అని విమర్శించారు.

జర్నలిస్టులకు ధన్యవాదాలు

'ఉదయం నుంచి కూడా ఎంతో ఓపిగ్గా రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు తెలియజేయడానికి 12 గంటలుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు, కెమెరామెన్లకు హృదయ పూర్వక ధన్యవాదాలు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ అరెస్టులకు నిరసనగా ఆందోళనలు చేపట్టిన బీఆర్ఎస్ కుటుంబసభ్యులకు, ఆ వార్తలు కవర్ చేసిన జర్నలిస్టులకు కృతజ్ఞతలు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

> పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారిపోయాయి. కేసులు, ఎఫ్ఐఆర్‌లు పోలీస్ స్టేషన్లో కాకుండా గాంధీభవన్‌లో తయారవుతున్నయి. ఎవరిని అరెస్ట్ చేయాలో గాంధీభవన్‌లో నిర్ణయిస్తున్నరు. పోలీసులు గుర్తుపెట్టుకోవాలి. చట్టమే శాశ్వతం.. రేవంత్‌రెడ్డి కాదు. - హరీశ్‌రావు

డబ్బులు సంపాదించాలె.. అంతే!

'రేవంత్‌రెడ్డి ఎంతకూ డబ్బులు సంపాదించాలె, ప్రతిపక్షాల మీద కేసులు పెట్టాలె అనుకుంటున్నరు తప్ప పాలన లేదు. ఏడాది పాలనలో మహిళలకు లక్ష కోట్ల రుణమన్నవు, అదంతా బోగస్. మహిళలకు మహాలక్ష్మి పింఛన్ ఇస్తనన్నవు.. అదీ బోగస్. ఇవాళ నువ్వు మమ్మల్ని సలహాలివ్వాలని అడుగుతున్నవు. మేం చాలా సలహాలిస్తున్నాము. కానీ నువ్వు పాటిస్త లేవు కదా? మేం నీ పాలనను అడ్డుకుంటలేము కదా, రేవంత్, భట్టి ఇద్దరూ బాండ్‌పై సంతకాలు చేసి హామీనిచ్చారు. వరంగల్ డిక్లరేషన్ 9 హామీల్లో ఒకటి కూడా అమలు కాలేదు. వాటిని అమలు చేయమని సలహా ఇచ్చాం కదా. మూడు సార్లు రైతుబంధు ఇవ్వమని అడిగినం కదా. 4 వేల వృద్ధాప్య పింఛన్ ఎపుడిస్తవు అన్నం కదా. మూసీలో గరీబోళ్ల ఇండ్ల కూలగొట్టద్దు అన్నం. అఖిలపక్షాన్ని పిలవమమన్నం. ఇది మా సూచన కాదా.. ఏ సూచనా తీసుకునే విజ్ఞత నీకు లేదు. ఫ్యాక్షనిస్టులా వ్యవహరిస్తున్నావు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చట్టం కాంగ్రెస్ పార్టీ చుట్టం

'రాష్ట్రంలో చట్టం కాంగ్రెస్ చుట్టం అయింది. పోలీసులు, హోంగార్డుల సమస్యలు ఎం దుకు పరిష్కరిస్తలేవు? 7 నెలల నుంచి పోలీసులకు టీఏలు ఇస్తలేవెందుకు? స్టేషన్ అలవెన్సులిస్తలేవు, సీసీ కెమెరాలు బాగు చేస్తలేవు. '30-40 వేలు రావాలి సార్, అవి వస్తే పిల్లల ఫీజులు కట్టాలి సార్. ఎవరికి చెప్పుకోవాలో అర్థం అయితలేదు' అని పోలీస్ సిబ్బంది బాధపడుతున్నారు. పోలీసులు కూడా ప్రతిపక్షానికి తమ బాధలు చెప్పుకునే పరిస్థితి వచ్చింది. రైతు రుణమాఫీ సగం మందికి ఎగ్గొట్టినవు, రైతుబంధు ఎప్పుడిస్తవో చెప్పడం లేదు. రైతులకు కష్టాలు అసలు ఎప్పుడన్నా విన్నారా? ఒక్కరోజన్నా శాసనసభలో మంచి సూచనలను వినే ఓపిక ఉండదు. అసెంబ్లీలో మమ్మల్ని మాట్లాడనిస్తవా?' అని నిలదీశారు.

ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన

'రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది బీఆర్ఎస్ కార్యకర్తలను, మహిళలను అరెస్టు చేశారు. వీళ్లందరినీ వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలి. పోలీసు అధికారులు రాజ్యాంగానికి లోబడి, చట్టానికి లోబడి పనిచేయాలని కోరుతున్నాం. కౌశిక్‌రెడ్డిని విడుదల చేసే వరకూ బీఆర్ఎస్ నిద్రపోదు. ఆయనకు అండగా ఉంటది. పోలీసులు చట్టానికి లోబడి ఉండాలి.. రేవంత్‌రెడ్డి కాదు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కేసీఆర్ మాట ఎత్తకుండా ఉన్నవా?

'నువ్వు ఎన్నో ఉపన్యాసాలు ఇస్తున్నవ్. కేసీఆర్ పేరెత్తకుండా ఉపన్యాసమిచ్చినవా? కేసీఆర్ పేరు ఎత్తకుండా ప్రజల గురించి, ఒక పాలసీ గురించి, ఒక అభివృద్ధి గురించి ఎప్పుడైనా మాట్లాడవా? నువ్వు నోరు ఎత్తితే కేసీఆర్‌ను తిడుతుంటివి. పేగులు మెడలో వేసుకుంటా. లాగుల్లో తొండలు జొరగొడతా.. ఇదేనా ముఖ్యమంత్రి మాట్లాడే పద్ధతి. ముఖ్యమంత్రిగా మర్యాదగా మాట్లాడితే, పాలసీ గురించి మాట్లాడితే, ప్రతిపక్షంగా మేము నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం. నువ్వు మర్యాద లేకుండా బూతులు తిడితే మేం భరించాలా, నీకు సూచనలివ్వాలా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

కౌశిక్‌కు బెయిల్ ఎందుకు ఇస్తలేరు

మా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసి 12 గంటలు అవుతున్నది. అపాయింట్‌మెంట్ తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళితే ట్రెస్‌పాస్ అంటవు, అదేమన్నా ప్రైవేట్ ప్రాపర్టీయా? ఎమ్మెల్యే ఇంట్లో చొరబడి, తలుపులు పగులగొట్టి అరెస్టు చేస్తవు. ఉదయం నుంచి సాయంత్రం దాకా 12 గంటల నుంచి బెయిలివ్వరు. మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నరు? దొంగ రాత్రి టెర్రరిస్టును తీసుకుపోయినట్టు తీసుకపోతరా? నాంపల్లి కోర్టుకు కూడా తీసుకుపోలేదెందుకు. ఏ సెక్షన్లు పెట్టాల్నో గాంధీభవన్ నుంచి, సీఎం రేవంత్ నుంచి పోలీసులకు ఇంకా ఆదేశాలు రాలేదా? అందుకే ఈ ఆలస్యం చేస్తున్నారా? నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, డీజీపీ సమాధానం చెప్పాలి. ఇది ఎక్కడి న్యాయం. ఎఫ్ఐఆర్ రాయడానికి 12 గంటలైనా సరిపోవడం లేదా? ఇది ప్రజా పాలన కాదు, రాక్షసపాలన, పోలీసు పాలన, పీడిత పాలనగా మారింది' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దు

పంజాగుట్టు పీఎస్ కేసులో మధ్యంతర ఉత్తర్వులు

కౌంటర్‌దాఖలుకు ఫిర్యాదుదారునికి నోటీస్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి గాదగోని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును అరెస్టు చేయరాదని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఆయనపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోరాదని కూడా పంజాగుట్ట పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. హరీశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆయనను ఆదేశించింది. పంజాగుట్ట పోలీసులు ఈ నెల ఒకటిన తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. హరీశ్ తరపున సీనియర్ న్యాయవాది జే రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై మోపిన అభియోగాలకు, నమోదు చేసిన చట్ట నిబంధనలకు పొంతన లేదని తెలిపారు. పిటిషనర్‌పై నమ్మకద్రోహం (ఐపీసీ 409 సెక్షన్), ప్రాణభయం (ఐపీసీ సెక్షన్ 386) సెక్షన్ల కింద గౌడ్ చేసిన ఫిర్యాదులోని అభియోగాలకు ఆధారాలు లేవని చెప్పారు. హరీశ్‌రావు మంత్రిగా ఉండగా చక్రధర్ గౌడ్, ఆయన కుటుంబసభ్యుల ఫోన్లు ట్యాపింగ్ చేయించారంటూ ఈ నెల ఒకటిన చేసిన ఫిర్యాదుకు ఆధారాలు పేర్కొనలేదని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కొనలేక తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఆపిల్ ఫోన్ల కంపెనీ నుంచి వినియోగదారులు అందరికీ తరుచుగా వచ్చే ఒక మెసేజ్ ('మీ ఫోన్ ట్యాపింగ్ అవుతోంది')ను ఆధారంగా చేసుకుని గౌడ్ తమ ఫోన్ల ట్యాపింగ్ జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రముఖ సెల్‌ఫోన్ల కంపెనీల నుంచి వారి వినియోగదారులు అందరికీ ఆ తరహా మెసేజులు వస్తాయని చెప్పారు. ఫోన్ల ట్యాపింగ్ చేశారంటూ గత నవంబర్ 22న దాఖలుచేసిన పిటిషన్‌ను గౌడ్ హైకోర్టు నుంచి ఉపసంహరించుకున్నారని గుర్తుచేశారు. ఆ తర్వాత రోజునే, డీజీపీకి గౌడ్ ఫిర్యాదు చేశారని తెలిపారు. తిరిగి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే దానిని కమిషనర్ పంజాగుట్ట పోలీసులకు పంపించారని చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. రాజకీయ కుట్రతో చేసిన ఫిర్యాదును పోలీసులు ప్రాథమిక విచారణ చేయకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. రాజకీయ కుట్రతో నమోదైన కేసులో పోలీసులు హరీశ్‌ను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నందున ఆయనను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రజల్లో ఉన్న పేరు పతిష్ఠలు దెబ్బతిసేందుకే హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారని అన్నారు. చక్రధర్‌గౌడ్ 2021 నుంచి హరీశ్‌రావుపై నిత్యం ఏదో ఒక కేసు నమోదు చేస్తూనే ఉన్నారని చెప్ప